క్లుప్తంగా

మెనూ ప్రకారం భోజనం అందించాలి


భోజన నాణ్యతను పరిశీలిస్తున్న ఏపీసీ దేవరాజు

మడకశిరరూరల్: విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ దేవరాజు (ఏపీసీ) సిబ్బందికి సూచించారు. గుండుమల కస్తూర్బా పాఠశాలను శుక్రవారం రాత్రి సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ దేవరాజు (ఏపీసీ) తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థినుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. ఆనంతరం వంట గదిని పరిశీలించడంతోపాటు విద్యార్థినుల కోసం తయారు చేసిన భోజన నాణ్యతను రుచి చూశారు. విద్యార్థినులతో సమస్యలపై ఆరా తీశారు. కేజీబీవీ సిబ్బంది ఉన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి


పోలీసులతో సమావేశమైన జడ్జి అశోక్‌కుమార్

మడకశిర: స్థానిక కోర్టులో సెప్టెంబర్ 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్ పోలీసులను కోరారు. శనివారం కోర్టు హాల్‌లో ఆయన నియోజకవర్గంలోని పోలీసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. సీఐలు రాజ్‌కుమార్, నగేష్, ఇతర మండలాల ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి


భోజనం వడ్డిస్తున్న డీఎస్పీ మహేష్, సీఐ అబ్దుల్‌కరీం

హిందూపురం: సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఎస్పీ మహేష్ సూచించారు. సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో సమితి ప్రెసిడెంట్ రవిశంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని డీఎస్పీ టూ టౌన్ సీఐ అబ్దుల్ కరీంబాషా కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అన్నదానానికి సహకరిస్తున్న దాతలను అభినందించారు. సేవా సమితి అధ్యక్షులు రవిశంకర్ మాట్లాడుతూ 12 ఏళ్లుగా అన్నదానాలు, తాగునీటి వసతి, పిల్లలకు పుస్తకాలు, భక్తి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యులు అశ్వత్ నారాయణ, సురేష్ ,వెంకటరామప్ప, రామకృష్ణ, నాగేంద్రప్ప, గొల్లన్న, రాజ్యలక్ష్మి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత స్థానాలు అధిరోహించొచ్చు


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన రమానందన్

లేపాక్షి: విద్యతో ఉన్నత స్థానాలు అధిరోహించొచ్చని కరణం రమామణి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, లేపాక్షి ఆలయ చైర్మన్ కరణం రమానందన్ పేర్కొన్నారు. చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కరణం రమామణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఈ ఏడాది టెన్త్‌లో ప్రతి విద్యార్థికి సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం గతేడాది టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన బిసలమానేపల్లికి చెందిన సుమంత్ అనే విద్యార్థికి రూ.50 వేలు విలువ చేసే ల్యాప్‌ట్యాప్‌ను అందజేసారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను పాఠశాల కమిటీచైర్మన్ చెన్నక్రిష్ణ, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు ఘనంగా సత్కరించారు.

ముస్లిం యువత అన్నదానం

సోమందేపల్లి: మండల కేంద్రంలో శనివారం వినాయక నిమజ్జనం సందర్భంగా నౌ జవాన్ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ వారు భోజన సౌకర్యం కల్పించిన ముస్లిం యువకులను అభినందించారు.



హిందూపురంలో నిమజ్జనానికి తరలుతున్న భారీ వినాయక ప్రతిమలు


మడకశిర మండలం జమ్మానిపల్లిలో భక్తుల సందడి

వినాయకా.. సెలవిక

సాక్షి బృందం: హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాలతో పాటు పావగడలో శనివారం వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆయా ప్రాంతాల్లో ఉదయం నుంచి వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం విగ్రహాలను ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. యువకులు, చిన్నారులు, మహిళలు నృత్యాలతో సందడి చేశారు. అనంతరం సమీపంలోని వంకలు, చెరువుల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.


శివమూర్తి ఒడిలో గణనాథుడు


హిందూపురంలో నృత్యం చేస్తున్న మహిళలు


పావగడలో వినాయకుడిని ఊరేగిస్తున్న దృశ్యం


రొళ్ల మండలం జీజీహట్టిలో వినాయక నిమజ్జనం చేస్తున్న దృశ్యం


పెనుకొండ మండలం చంద్రగిరిలో వినాయకుడి ఊరేగింపు


రొద్దం మండలం కలిపి గ్రామంలో నృత్యం చేస్తున్న భక్తులు

సమాజంలో రుగ్మతలను రూపుమాపాలి

- అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

హిందూపురం: మాదకద్రవ్యాలు, బాల్య వివాహాలు వంటి సమాజ రుగ్మతులను రూపమాపాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ అన్నారు. కిరికెర వినాయక నగర్‌లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈసందర్భంగా ఏడీజే మాట్లాడుతూ ఆడపిల్లల కదలికలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారిస్తూ జాగ్రత్తలు చెబుతుండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రస్తుతం మాదకద్రవ్యాలు సమాజాన్ని కలుషితం చేస్తున్నాయని, వాటి నిర్మూలనకు అందరూ బాధ్యత తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. రాజ్యాంగం ప్రకారం 14 ఏళ్ల లోపు బాల,బాలికలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అమలు చేస్తున్నారన్నారు. కేవలం ఆస్తుల పంపకాలే కాకుండా తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యత కుమారులతో పాటు కుమార్తెలకు ఉందన్నారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే అలాంటి బాధితులు నేరుగా


మాట్లాడుతున్న ఏడీజే కంపల్లె శైలజ

న్యాయస్థానంలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయని, వాటిని సరైన పద్ధతిలో వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.వ్యక్తిగత, సామాజిక సమస్యలను లోక్ అదాలత్ దృష్టికి తీసుకువచ్చి ఎలాంటి రుసుం లేకుండా న్యాయ సహాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్, సర్పంచ్ భాగ్యమ్మ, న్యాయవాదులు కళావతి, సంతోషి కుమారి, రవిచంద్ర, కార్యదర్శులు సూర్యప్రకాష్, నరేష్, లోక్ అదాలత్ హేమావతి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనతో సమస్యల పరిష్కారం

హిందూపురం: ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని హిందూపురం సీనియర్ సివిల్ జడ్జ్ డి వెంకటేశ్వర్లు నాయక్ పేర్కొన్నారు. శనివారం చిలమత్తూరు మండలం దిగువపల్లి తండాలో వివిధ చట్టాల అమలుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి చట్ట పరిధిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాలను అక్కడి ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేకంగా చట్టాలు రూపొందించారని ఆయా వర్గాలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేదలకు ప్రభుత్వం ఉచిత న్యాయ సహాయం కూడా అందిస్తుందన్నారు. 12 ఏళ్లలోపు బాలికలపై లైంగిక వేధింపులకు గురిచేయడం చట్టరీత్యా


స్థానికులతో సమస్యలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి వెంకటేశ్వర నాయక్

నేరమని నిందితులకు జీవిత ఖైదు విధించే అవకాశం ఉంటుందని న్యాయమూర్తి తెలిపారు. ఎంపీడీఓ రమణమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథ్, కార్యదర్శి భాస్కర్, సర్పంచ్ బాబే లీలా బాయి, న్యాయవాదులు సుధాకర్, కృష్ణమూర్తి, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

అమరాపురం: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి పేర్కొన్నారు. శనివారం హేమావతి, అమరాపురం పీహెచ్‌సీలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ, మందుల రిజిష్టర్లను పరిశీలించారు. రోజూ ఎంతమంది రోగులు ఆస్పత్రికి వస్తున్నారు, వైద్య సేవలు ఏవిధంగా అందిస్తున్నారు తదితర వివరాలను సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. రోగులకు సరైన మందులను ఇవ్వాలన్నారు. మందులు ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రస్తుతం వర్షకాలం కావడంతో దోమలు వృద్ధి చెంది మలేరియా, టైఫాయిడ్ తదితర రోగాలు ప్రబలుతాయని, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ఏవైనా జ్వరాలు ప్రబలితే వెంటనే రోగులకు ప్రభుత్వాస్పత్రులకు పంపాలని సూచించారు. అనంతరం కె.శివరం ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు భార్గవ్, అంబరీష్, సిబ్బంది పాల్గొన్నారు.


అమరాపురంలో మందుల రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

గుడిబండ: దేవరహట్టి గ్రామంలో శనివారం యాదవ కులస్తుల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. మహిళలు జ్యోతులతో ఊరేగింపు వచ్చి స్వామివారికి సమర్పించారు. ఈ సందర్భంగా కాంతరాజు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు రంగధామప్ప, తిమ్మన్న, చంద్రప్ప, శివకుమార్, నాగరాజు, కురుబ సంఘం అధ్యక్షుడు మాలింగప్ప, చిత్తప్ప, జయన్న, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాక్యూం కుకింగ్ విధానం లాభదాయకం

హిందూపురం: పట్టుగూళ్లకు సంబంధించి వాక్యూం కుకింగ్ విధానం లాభదాయకమని సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్త సంజీవ్ గుప్తా పేర్కొన్నారు. స్థానిక పట్టుగూళ్ల మార్కెట్‌లో మేరా రేషం మేరా అభిమాన్ (ఎంఆర్ఎంఏ)లో భాగంగా శనివారం వాక్యూం పర్మియేషన్ కుకింగ్ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు వాక్యూం పర్మియేషన్ కుకింగ్ విధానంపై ప్రత్యక్ష ప్రదర్శనతో పాటు రా సిల్క్ నాణ్యతా ప్రమాణాలు, గ్రేడింగ్ విధానాలను వివరించారు. సంప్రదాయ పాన్ కుకింగ్ పద్ధతులతో పోలిస్తే వాక్యూం పర్మియేషన్ కుకింగ్ చాలా సులభంగా ఉంటుందన్నారు. ఈ ఆధునిక విధానం ద్వారా నీరు కోకూన్ లోపల సులభంగా ప్రవేశించి, రీలింగ్‌కి మరింత అనుకూలంగా మారి,


మాట్లాడుతున్న శాస్త్రవేత్త సంజీవ్‌గుప్తా

రా సిల్క్ నాణ్యత మెరుగు పడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో సెరికల్చర్ జేడీ శోభరాణి, ఏడీ ఎ.రత్నం, హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్ అధికారి హంపయ్య, పట్టుపరిశ్రమ అధికారి శరత్ చంద్రబాబు, రీలర్లు ముస్తఫా, బాషా, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దాం

గుడిబండ: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దామని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం ఆయన ఫళారం గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్పను ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. నియోజకవర్గంలోని కురుబ కులస్తులకు జరుగుతున్న అన్యాయాలపై చర్చించారు. ఈ సందర్భంగా గడ్డం రామకృష్ణ మాట్లాడుతూ 16 నెలల కూటమి ప్రభుత్వం పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్‌గా చేసుకుని అక్రమ కేసులు పెడుతూ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందన్నారు. వైఎస్ జగన్ హయాంలో అమలైన సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలను చంద్రబాబు ఎలా


ఈరలక్కప్పను సన్మానిస్తున్న కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు

మోసం చేశారో ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు శేషాద్రి, చేనేత అధ్యక్షులు మంజునాథ్, క్రిష్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు నరసింహ, హరేసముద్రం సర్పంచ్ కరియన్న, నాయకులు కిశోర్, లక్ష్మీనారాయణ, చిరంజీవి, జగన్నాథ్, వెంకటేష్, రవికుమార్, శేషచలం, కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అక్రమ కేసుల నుంచి కార్యకర్తలను కాపాడండి

హిందూపురం టౌన్: కూటమి ప్రభుత్వ కుట్రల కారణంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై నమోదవుతున్న అక్రమ కేసుల నుంచి వారిని రక్షించాలని ఆ పార్టీ నియోజకవర్గ నేత గుడ్డంపల్లి వేణురెడ్డి లీగల్ సెల్ నేతలను కోరారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ లీగల్ సెల్ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణురెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్‌గా కూటమి ప్రభుత్వం అక్రమ కేసుల్లో ఇరికిస్తోందన్నారు. పార్టీ శ్రేణులను అక్రమ కేసుల నుంచి కాపాడే బాధ్యత పార్టీ న్యాయవిభాగం ప్రతినిధులపైనే ఉందన్నారు. సమావేశంలో లీగల్ సెల్ ప్రతినిధులు రామచంద్రారెడ్డి, వెంకటరెడ్డి, ఇందాద్, వన్నూరప్ప, కృష్ణమూర్తి, కదిరీష్, ఉదయ్ సింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు బలరామిరెడ్డి, జబీవుల్లా, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్, నాయకులతో సమావేశమైన వేణురెడ్డి

ఓటరు జాబితా సవరణను వ్యతిరేకించాలి

హిందూపురం టౌన్: ఎన్నికల సంఘం తీసుకొచ్చిన ఓటరు జాబితా సవరణను అందరూ వ్యతిరేకించాలని ఎస్‌యూసీఐ నాయకులు కోరారు. శనివారం కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గిరీష్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కింద ఓటరు జాబితా సవరణను చేపట్టడం సరైంది కాదన్నారు. దేశ పౌరులు మాత్రమే ఎన్నికల జాబితాలో ఉండదానికి అర్హులు అనే పేరుమీద ఎన్నికల కమిషన్ గతంలో ప్రచురించిన 7.73 కోట్ల ఓటర్ల జాబితా నుంచి 65 లక్షల మంది పేర్లను తొలగించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారెడ్డి, మల్లిక్ దత్, అశోక్, రంగనాయకులు, పూజిత తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌యూసీఐ నాయకులు

పదోన్నతి పొందిన ఉపాధ్యాయుడికి సన్మానం

గోరంట్ల: వానవోలు జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జాన్ రెడ్డెప్ప పెనుకొండ డీవైఈఓగా పదోన్నతి పొందారు. శనివారం వానవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జాన్ రెడ్డెప్పను ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాతో సత్కరించారు.


జాన్ రెడ్డెప్పను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దండి

అమరాపురం: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ సత్యనారాయణ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండలంలోని వివిధ పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల స్థాయిని గుర్తించి బోధన చేయాలన్నారు. మాదిరి పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా తక్కువ మార్కులు వచ్చిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలోఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రొళ్ల: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈఓ శ్రీధర్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంఈఓ విద్యాబోధనపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

వినాయక లడ్డూ వేలం

పెనుకొండ రూరల్: గొల్లపల్లి గ్రామంలో శనివారం వినాయక లడ్డూ వేలం వేశారు. గ్రామానికి చెందిన సింగిల్‌విండో అధ్యక్షుడు సూర్య ప్రకాశ్‌రెడ్డి రూ.25వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయండి


మాట్లాడుతున్న ఎంఈఓ గంగప్ప

హిందూపురం టౌన్: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ గంగప్ప, బుక్కపట్నం డైట్ కళాశాల లెక్చరర్లు ఆదర్శ్, ప్రభాకర్ సూచించారు. శనివారం ముద్దిరెడ్డిపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో క్లస్టర్ సమావేశానికి నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశీలకులుగా బుక్కపట్నం డైట్ కళాశాలకు చెందిన లెక్చరర్లు ఆదర్శ్, ప్రభాకర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులను అసెస్మెంట్ బుక్స్‌కు అలవాటు చేయించాలన్నారు. అభ్యాసనా ఫలితాలను ఏవిధంగా రాబట్టాలో వివరించారు. కార్యక్రమంలో ముద్దిరెడ్డిపల్లి క్లస్టర్ పాఠశాలల్లోని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, క్లస్టర్ కార్యదర్శి కొండయ్య, శేషారెడ్డి పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో ఘర్షణ

రొద్దం: రాచూరు గ్రామంలో శనివారం సాయంత్రం వినాయక నిమజ్జనంలో ఘర్షణ చోటు చేసుకుంది. డీజే విషయంలో ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. పోలీసులు కలుగజేసుకోవటంలో గొడువ సద్దుమణిగింది.

ప్రొటీన్ లోపంతో మానసిక ఒత్తిడి

హిందూపురం: ఆహారంలో ప్రొటీన్ల లోపం, వ్యక్తిగత జీవన సంతులిత లోపంతో మానసిక ఒత్తిడి తలెత్తుతుందని ప్రభుత్వ ఆసుపత్రి సైకియాట్రిక్ డాక్టర్ జీవన పేర్కొన్నారు. విప్రో కేర్స్, వాసవ్య మహిళా మండలి, కుశల్ ఆరోగ్య కేంద్రం ద్వారా తూమకుంట చెక్ పోస్ట్‌లోని విప్రో ఓల్డ్ ప్లాంట్ ఉద్యోగులకు ఒత్తిడి నిర్వహణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ సమయ పట్టికలతో సక్రమమైన వ్యాయామం, సరైన ఆహారం విశ్రాంతి పద్ధతులు పాటించడం ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. చాలామంది పనిభారం, విశ్రాంతి తక్కువ కావడంతో ఇతర వ్యాపకాలతో సరైన ఆరోగ్యజాగ్రత్తలు పాటించక పోవడంతోనే ఆరోగ్యాలు దెబ్బతింటుంటాయన్నారు. కార్యక్రమంలో విప్రో ప్లాంట్ ప్రతినిధి మాదయ్య, కాంతి కిరణ్, కొండలరావు, ట్రైనింగ్ ఆఫీసర్ గురుదత్, డాక్టర్ సల్మా, మరియమ్, కోఆర్డినేటర్ శిరీష, లలిత పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన

అగళి: దళితులను అవమానించినా, కులం పేరుతో వేధింపులకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ సుబ్బరావు, ఎస్ఐ వీరేష్ పేర్కొన్నారు. ఇనగలూరు గ్రామంలో శనివారం పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం చేపట్టారు.

పనులు వేగవంతం చేయండి


కౌన్సిల్ మీట్ నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిర: మడకశిర మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. శనివారం మడకశిర మున్సిపల్ మీట్ చైర్మన్ నరసింహరాజు అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా మున్సిపాలిటీని అభివృద్ధి చేయాలని కోరారు. అభివృద్ధి పనులు కౌన్సిలర్ల ఆధ్వర్యంలోనే చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులకు ఎమ్మెల్యే భద్రత జాకెట్లు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు, వైస్ చైర్మన్లు వెంకటలక్ష్మమ్మ, ప్రభావతి, కమిషనర్ జగన్నాథ్, ఏఈ మురళి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే 44 మందికి దాదాపు రూ.15లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు.

రోడ్డు పనులకు భూమిపూజ

పావగడ: పట్టణంలోని 4 వ వార్డు కు చెందిన బనశంకరి లే అవుట్ లో సీసీ రోడ్డు నిర్మాణానికి స్థానిక మున్సిపల్ చైర్మన్ సుదేశ్ కుమార్ శనివారం భూమి పూజ చేశారు. మట్టి రోడ్డు తో ఇబ్బందులు పడుతున్న కాలని వాసుల విజ్ఞప్తి మేరకు సుదేశ్ కుమార్ స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. రూ 10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు.

విద్యార్థికి సన్మానం

పావగడ: మధుగిరిలో జరిగిన విజ్ఞాన సెమినార్ పోటీల్లో స్థానిక వీఎస్ పబ్లిక్ పాఠశాల విద్యార్థి సాయి వెంకట్ ప్రథమ స్థానంలో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. శనివారం స్థానిక పాఠశాలలో పాఠశాల యాజమాన్యం శనివారం విద్యార్థిని ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో విద్యాసంస్థ కార్యదర్శి అశ్వర్థ నారాయణ, ట్రెజరర్ దీపిక, బీఈఓ రేణుకమ్మ, ఈసిఓ చంద్రశేఖర్, అధికారులు ఖాజా హుస్సేన్, రంగనాథ్ పాల్గొన్నారు.